

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 163 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 14, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# దేశంలో పెరుగుతున్న.. దోపిడీతనం !



దేశం దివాలా తీస్తుంది ప్రజలు తిరగబడుతున్నారు

దిగజారుడు వ్యవస్థకు దారులు పరుస్తున్న రాజకీయ వర్గాలు

ఒకే దేశం ఒకే దోపిడీ మార్గాన్ని సుఖాంతపరచుకుంటున్నారు

దేశ ఆదాయానికి గండి కొడుతున్న ఘటికులు

దేశంలో ఆదాయ నిలువు దోపిడీ జరుగుతుంది

ప్రజాసోమ్మును లెక్కలేసుకొని పంచుకుంటున్నారు

రాజకీయ నాయకుల దీర్ఘకాలిక పదవులు దేనికోసం

దేశ రాజకీయాల్లో రాజకీయ చట్టాలు మార్చబడాలి


లక్షల కోట్ల రూపాయలు దుర్వినియోగం జరగడం నాయకుల పనే

దేశంలో 90 శాతం ప్రజలు మోసపోతూనేవున్నారు

నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాలు లీకులతో దేశం పరువు తీశారు

దేశంలో దోసుకున్నోనికి దోచుకున్నంత

చట్టాలు న్యాయస్థానాలతో పనేం లేదు అధికారంలో ఉంటే అన్ని సర్దుకుపోతాయి : డాక్టర్ బరిగెల శివ



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్) :**

దేశ ఆదాయాన్ని దోచుకోవడానికి రహస్య మార్గాలు పాటిస్తుండడం రాజకీయ నాయకుల అవినీతి బండారం బయటపెట్టినట్లుగా ఉందని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా హెచ్చరించారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ఆర్థిక వనరులను కాపాడుకోవడం కోసం మే 10న తెలంగాణ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా బహిరంగ సభలో దేశ ప్రజలకు ఐదు ప్రాథమిక సూత్రాలను తెలియజేయగా విదేశీ ప్రయాణాలను చేయకండి అంటూ మోడీ మాట్లాడడం, బంగారం కొనుగోలు చేయకండి అంటూ తెలపడం దేశ ఆర్థిక వ్యవస్థ కోసం పాటుపడాలని చెప్పినట్లు సూచించిన విషయాల్లో దేశంలోనే అత్యంత ఖరీదైన 8 వేల కోట్ల విమానంలో విదేశీ పర్యటనలు చేసుకుంటూ దేశ ప్రజలకు విదేశీ పర్యటనలు విదేశీ ప్రయాణాలు తగ్గించాలని సూచించడం వికారంగా ఉందన్నారు. అలాంటప్పుడు ప్రపంచ దేశాల్లో ఉన్న దేశ ప్రజలందరినీ భారతదేశానికి రప్పించి వాళ్లకు కావాల్సిన సౌకర్యాలను ఉద్యోగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వంట నూనెలు వాడకం తగ్గించండి అంటూ బంగారం కొనకండి అంటూ విదేశీ ప్రయాణాలు చేయకండి వర్క్ ఫ్రం హోం చేయండి అంటూ ఆన్లైన్ మీటింగ్స్ పెట్టుకోండి అంటూ మోడీ త్యాగశీలి మాటలు మాట్లాడడం 12 సంవత్సరాలుగా ఎటు పోయింది అంటూ నిలదీశారు. దేశంలో కొన్ని ప్రధాన రాష్ట్రాలను పూర్తిగా నిర్వీర్యం చేసిన మోడీ దేశ ప్రధానిగా కొనసాగడానికి ఏమాత్రం వీలులేదని దేశ ప్రజలు ఇంతగా చీదరించుకుంటున్నా పదవిపై వ్యామోహంతో పదవిపై మోజుతో పదవిపై ఆకాంక్షతో 75 సంవత్సరాలు దాటిన దేశ ప్రజలను చిత్రహింసలు పెట్టడం మాత్రం మానడం లేదన్నారు. దేశంలోని ధన సంపదనంతా లూటీ

- మిగతా 2లో..

## విచారణకు హాజరుకాలేకపోతున్నాను

పోలీసులకు బండి భగీరథ్ లేఖ

వ్యక్తిగత కారణాల వల్ల హాజరుకాలేకపోతున్నట్లు వెల్లడి

విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు మరో రెండు రోజులు కావాలని విజ్ఞప్తి

దర్యాప్తుకు సహకరిస్తానన్న బండి భగీరథ్

విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని కేటాయించాలని విజ్ఞప్తి

2



## హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్..

మే నెలాఖరులోగా ఇళ్ల మంజూరు పత్రాలు

జూన్ 2న ఆదిలాబాద్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం

మే 21న జరిగే కేబినెట్ సమావేశంలో విధివిధానాల ఖరారు

లబ్ధిదారుల నివాస ప్రాంతాలకు 5-8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లు

హైదరాబాద్‌లో సొంత స్థలం ఉన్నవారికి మే చివరికల్లా మంజూరు పత్రాలు



5

## కాకతీయ కళల జాతర రాష్ట్ర స్థాయిని దాటి ఖండాంతర స్థాయిలో గుర్తింపు పొందాలి

6

## బక్రీద్ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక



3



## తెలంగాణలో ఉబెర్ భారీ విస్తరణ

సీఎం రేవంత్‌తో సీఈవో భేటీలో కీలక చర్చలు

సీఎం రేవంత్ రెడ్డితో ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి భేటీ

హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణకు ఉబెర్ నిర్ణయం

పార్కింగ్ రంగంలోకి రావాలని ఉబెర్‌కు సీఎం రేవంత్ సూచన

భారత్ ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటుపై ఉబెర్ ఆసక్తి

5

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

# దేశంలో పెరుగుతున్న దోపిడితనం

మొదటి పేజీ తరువాయి

చేయడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న మోడీని ప్రపంచంలోనే అత్యంత అవినీతిపరుడుగా ప్రకటించిన "కాగ్" నివేదిక ఎన్డీఏ ప్రభుత్వం లోని భారీ అవినీతిని బహిర్గతం చేసిందని గుర్తు చేశారు.కేంద్ర ప్రభుత్వ నిధుల నుండి దాదాపుగా 54 వేల కోట్ల రూపాయలు మాయమయ్యాయని కాగ్ నివేదిక వెల్లడించినట్లు తెలిపారు.కార్పొరేట్ల నుండి 74 వేల కోట్ల రూపాయల ఆదాయ పన్ను వసూలు చేయకుండా మరో అవినీతికి పాల్పడిందని కాగ్ నివేదిక వెల్లడించినట్లు తెలిపారు.విదేశాంగ మంత్రిత్వ శాఖ వద్ద 50 వేల కోట్ల రూపాయల వివరాలు లేకపోవడం దేశంలో మోడీ వ్యక్తిగతంగా నడిపిస్తున్న ప్రధాన ఆధారాలు పూర్తి అవినీతిమయంతో నిండిపోయాయని కాగ్ నివేదిక బట్టబయలు చేయడం దేశ ప్రధాని అవినీతిని ఒక్కసారిగా వెలుగులోనికి తెచ్చిందన్నారు.దేశ ప్రజల్ని మతం ముసుగులో మాయ చేస్తూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటనుండి నేటి వరకు ఏ ప్రధానమంత్రి చేయని దేశ ఆర్థిక నిలువ దోపిడిని ప్రధానమంత్రి మోడీ చేసి నిరూపిస్తున్నాడని తీవ్రంగా విమర్శించారు.12 ఏళ్ల దేశ పరిపాలనలో దేశాన్ని ఎంత దివాలాస్థితికి తీసుకువచ్చారో దేశ ప్రజలందరూ గగ్గోలు పెడుతున్నప్పటికిని కేంద్ర ప్రభుత్వంలో ఏమాత్రం చలనం రాకపోవడం నరేంద్ర మోడీ వ్యక్తిగత పొగరుబోతు తనాన్ని దేశ ప్రజలపై రుద్దుతున్నట్లుగా కనిపిస్తుందన్నారు.ప్రజలు ఏం కొనాలో ఏం కొనకూడదో, ప్రజలు ఏం తినాలో ఏం తినకూడదో ఎక్కడికి వెళ్లాలో ఎక్కడికి వెళ్ళకూడదో కేంద్ర బిజెపి ప్రభుత్వమే నిర్ణయం చేశాక దేశ ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛ హరించి వేసినట్లు కాదంటూ నిలదీశారు.దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరగవలసిన ముందస్తుగా ఎన్నికల ప్రకటన విడుదల చేస్తూ ఎన్నికలు జరిగే రాష్ట్రంలో ఈసీఐ,"సర్" ను ప్రారంభిస్తుండడం ఆసరా పెట్టుకుంటూ లక్షలాది సంఖ్యలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లను తొలగింపు చేయడం మొదలు పెడుతూ ఈసీఐ ఈడి సిఆర్పిఎఫ్ బిజెపి బలగాలన్నీ ఐక్యంగా రాష్ట్రంపై విరుచుకుపడుతూ రాష్ట్రంలో చొరబడి రాష్ట్రంలో నిర్వహించబడుతున్న ఎన్నికలలో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటూ రాష్ట్రాలన్నిటిని బిజెపి గుప్పిట్లోకి తీసుకురావడం కోసం జాతీయ ఎన్నికల కమిషన్ చేస్తున్న ప్రయత్నాలు దేశ రాజకీయాలను దేశ ఆర్థిక భవిష్యత్తును తీవ్రంగా నాశనం చేస్తున్నాయని విమర్శించారు. అడప తడప చిన్న రాష్ట్రాలను ప్రతిపక్షాలకు వదిలేస్తూ మిగిలిన పెద్ద రాష్ట్రాలను బిజెపి కైవసం చేసుకోవడం కోసం ఇలాంటి తీవ్రమైన కుట్రపూరిత ప్రణాళికలు నిరంతరం జరుగుతూనే ఉన్నారని గుర్తు చేస్తూ దేశంలో ఇకపై జరగబోయే ప్రతి రాష్ట్ర ఎన్నికల్లో కూడా ఇదే పునరావృతం కాబోతుందంటూ మిగతా రాష్ట్రాలు అప్రమత్తం కావాలని గుర్తు చేశారు.దేశంలో బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించబడితే కేంద్ర ప్రభుత్వం కుట్రలు జాతీయ ఎన్నికల కమిషన్ కుట్రలు పూర్తిస్థాయిలో బట్టబయలు అయ్యే ఆస్కారం ఉందన్నారు.ఈవీఎం మిషన్ల ద్వారా ఎన్నికలు జరిగితే ప్రతి రాష్ట్రంలో గెలుపొందుతున్న బిజెపి దేశవ్యాప్తంగా బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించబడితే 40 సీట్లు రావన్న సంగతిని మర్చిపోకూడదన్నారు.అప్పుడే బిజెపి పార్టీకి మూడో మిత్రుడుగా జాతీయ ఎన్నికల కమిషన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తోడ్డయ్యడంటూ దేశవ్యాప్తంగా తీవ్రమైన ప్రచారం కొనసాగుతుండడం శివసేన అధినేత ఉద్ధవ్ ఠాకరే బహిరంగంగా ప్రకటించడం దేశ ప్రజల్లో తీవ్రమైన కలవరం రేపిందని గుర్తు చేశారు.ప్రజల మనోభావాలను ప్రజల ఆశయాలను ప్రజల అభివృద్ధిని ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా దేశ ఆర్థిక వనరుల మీద తీవ్రమైన నష్టాన్ని వాటిల్లచేస్తూ దేశ ఆర్థిక వనరులను నిలువు దోపిడీకి పాల్పడుతున్న వ్యక్తులను వదిలేస్తూ దేశంలో 12 ఏళ్ల కాలం పాటు పాలిస్తున్న బిజెపి పార్టీ ప్రపంచ స్థాయి అవినీతిని పెంచిపోశించింది అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.దేశంలో బిజెపికి తిరుగులేదనే సాంకేతాన్ని బలపరచడం కోసం వాళ్ళ అవినీతిని గాని అక్రమాలను గాని ఎన్నికల్లో జరుగుతున్న చట్ట విరుద్ధమైన కార్యక్రమాలను గాని ఎప్పటికప్పుడు ఆధారాలు లేకుండా పరిపాలిస్తుండటమే కాకుండా ప్రశ్నిస్తున్న రాజకీయ నేతలను ప్రశ్నిస్తున్న వ్యక్తులను ప్రశ్నిస్తున్న ఉద్యమకారులను ప్రశ్నిస్తున్న ప్రజా సంఘాలను ప్రశ్నిస్తున్న మేధావులను భయంకరమైన కేసులలో ఇరికిస్తూ వాళ్ల జీవితాలను నాశనం చేయడమే కాకుండా న్యాయస్థానాల ద్వారా సంవత్సరాల కాలం పాటు బేయిల్స్ రాకుండా చేస్తూ నిరంతరం వాళ్లను జైల్లోనే మక్కే విధంగా చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రోజులు చెల్లుబాటుగాక తప్పదంటూ హెచ్చరించారు.భారత రాజ్యాంగంపై మూకుమ్మడిగా దాడులకు పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వం దేశంలో లక్షలాది కోట్ల రూపాయల నిలువు దోపిడిని పెంచి పోషిస్తుందని తీవ్రంగా విమర్శించారు.దేశంలో పచ్చని పంట పొలాలను అనుకుని జీవిస్తున్న రైతులను నాశనం చేయడం మొదలుకొని దేశానికి ఆర్థిక లాభాలు చేకూరుస్తున్న ప్రతి ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి దేనికి పనికి రాకుండా చేసి నాశనం చేయడమే కంకణంగా పెట్టుకున్న బిజెపి పార్టీని దేశ ప్రజలు ఇంతలా చీదరించుకున్న జాతీయ ఎన్నికల కమిషన్ సహాయంతో ప్రతి రాష్ట్రాన్ని అక్రమ పద్ధతిలో స్వాధీనపరుచుకుంటూనే ఉంటున్నారని తీవ్రంగా హెచ్చరించారు.12 సంవత్సరాల కాలం పాటుగా దేశంలో బిజెపి ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుండి తీసుకున్న ఆర్థిక సొమ్మును ఏ రీతులుగా ఖర్చులకు వాడుకుందో దేశ ప్రజలకు పీఎంవో కార్యాలయం నుండి బహిరంగ లేఖ ద్వారా తెలియపరచాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.ప్రాజెక్టుల నిర్మాణ రూపం లో నేషనల్ హైవేల రూపంలో లక్షల కోట్ల రూపాయలు దుబారాగా వాడబడుతున్నాయని తీవ్రంగా హెచ్చరించారు.ఏ దేశంలో లేని విధంగా బంగారం ధరను ఆకాశానికి చేరే విధంగా పెంచేసి దేశ ప్రజలను బంగారం కొనద్దని తెలపడం విడ్డూరంగా ఉందన్నారు.మెట్రో రైలు ప్రయాణాలను మానేయండి అంటూ బస్సుల్లోనే వెళ్లండని తెలపడం దేశ ప్రజల అత్యవసర ప్రయాణ సౌకర్యాలను దెబ్బతీయబోతున్నట్లుగా ఉందని గుర్తు చేశారు.ఇండియాలో ఉత్పత్తి చేయబడుతున్న ఉత్పత్తులకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ కొనుగోలు చేయండి అని మోడీ తెలపడం వినడానికి వికారంగా ఉందన్నారు.12 సంవత్సరాల దేశ పరిపాలనలో పైన తెలుపబడిన ఏ ఒక్కటి అభివృద్ధి చెందలేదని తెలుపుతూ దేశాన్ని ఉద్దేశించి మోడీ చేసిన ప్రకటనలో దేశంలో ఏ ఒక్క ఉత్పత్తి రంగాన్నైనా స్థాపించగలిగారా అని ప్రశ్నించుకోగలిగితే సర్వం శూన్యం శుద్ధ నాశనం తప్ప చేసింది ఏం లేదని దేశ ప్రజలకు తెలిసిపోయిందన్నారు.మట్టుకైతే దేశంలో ఆర్థికపరమైన నూతన పరిశ్రమలు ఏవి స్థాపించబడలేదని పైగా దేశంలోని ప్రైవేట్ యంత్రంగాలను ఒక్కొక్కటిది తన సన్నిహిత స్నేహ వర్గాల కోసం బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తుండడం దేశ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తెలిపారు.సుమారు 100 కోట్ల మంది ప్రజలకు రేషన్ సరుకులు మంజూరు చేసే స్థాయికి దేశ ఆర్థిక వ్యవస్థను దేశ దీర్ఘకాలిక అభివృద్ధి వ్యవస్థను దిగజార్చిన కేంద్ర ప్రభుత్వం కడుబీద ఆర్థిక పరిస్థితుల్లో ఉన్నటువంటి ప్రజలు జీవనోపాధికే దిక్కు లేకుండా ప్రాణాలు కోల్పోతుంటే నిత్యవసరాల వస్తువులు కొనుక్కునే స్థోమత ఎక్కడి నుండి వస్తుందో ప్రధాని మోడీ దేశ ప్రజలకు తెలియజేస్తే బాగుంటుందని తెలిపారు.ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేయడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను నిలువు దోపిడీకి పాల్పడుతున్న ఆదాయానికి మించిన ఆస్తిదారులను కేవలం మూడు నాలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తులకే పరిమితం చేస్తూ దేశాన్ని మొత్తం లూటీ చేయడం రాష్ట్రాలను మొత్తం క్యాప్చర్ చేయడం దేశంలో కొత్త రకం రాజకీయాన్ని కొత్త రకపు అవినీతి సామ్రాజ్యాన్ని అనుకున్న విధంగానే స్థాపించడం కోసం చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఉరుకులాడుతున్న, ఉరకలేస్తున్న,దేశ పరిస్థితిలను చక్క పెట్టుకోవాల్సిన బాధ్యత 145 కోట్ల దేశ ప్రజలదేనని విజ్ఞప్తి చేశారు.ప్రజలారా మేల్కోండి దేశ భద్రతకు కలుగుతున్న ఆర్థిక దోపిడి భంగం నుండి దేశాన్ని కాపాడుకొండంటూ పిలుపునిచ్చారు.

## నిర్మాతలు వర్సెస్ ఎగ్జిబిటర్లు... టాలీవుడ్ లో ఏం జరుగుతోంది?

**పెద్ది సినిమా విడుదలకు ముందు టాలీవుడ్‌లో పర్సంటేజీపై చర్చ**
**పర్సంటేజీ విధానం అనుమతించిన సినిమాలనే ప్రదర్శిస్తామన్న ఎగ్జిబిటర్లు**
**ఏకపక్ష నిర్ణయం సరికాదన్న నిర్మాతలు**




హైదరాబాద్, జై భీమ్ న్యూస్

రామ్ చరణ్ 'పెద్ది' సినిమా విడుదలకు ముందు టాలీవుడ్‌లో నిర్మాతలు వర్సెస్ ఎగ్జిబిటర్లు అన్నట్లుగా మారింది. ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ నిన్న కీలక నిర్ణయం తీసుకుంది. సింగిల్ స్క్రీన్‌లలో పర్సంటెజీ విధానానికి అంగీకరించిన నిర్మాతల సినిమాలనే ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ నిర్ణయంపై యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ బుధవారం మీడియా సమావేశం నిర్వహించింది. రవిశంకర్ యలమంచిలి, నాగవంశీ, సాహు గారపాటి, సతీష్ కిలారు తదితరులు ప్రెస్ మీట్‌లో పాల్గొన్నారు. చిత్ర పరిశ్రమలో ఎగ్జిబిటర్లతో పాటు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. మూడు సెక్టార్లు కూర్చుని మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు. రవిశంకర్ మాట్లాడుతూ, తాము ఎవరికీ వ్యతిరేకం కాదని అన్నారు. సినిమా అనేది ఏ ఒక్కరి కష్టం కాదని పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమలో ఒక ఎకో సిస్టమ్ ఉందని తెలిపారు. ఎగ్జిబిటర్ల ఇబ్బందులను తాము అర్థం చేసుకుంటామని అన్నారు. అయితే పరిశ్రమలో అందరూ కలిసి మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎగ్జిబిటర్ వ్యవస్థలో మార్పు రావాలని, కానీ ఇప్పటికిప్పుడు మార్పు రావాలంటే కష్టమని అన్నారు. హరిహర వీరమల్లు విడుదల సమయంలో పర్సంటేజీ విధానం బయటకు వచ్చిందని, ఆ తర్వాత మరెన్నో సినిమాలు విడుదలయ్యాయని అన్నారు. ఇప్పుడు పెద్ది సినిమా విడుదల అవుతున్న సందర్భంగా బ్లాక్‌మెయిల్ చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. పర్సంటేజీ విధానాన్ని అమలు చేసే సినిమాలనే ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్లు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరైన విధానం కాదని నాగవంశీ అన్నారు. ఎగ్జిబిటర్లు అడుగుతున్న పర్సంటేజీని తాము ఇవ్వలేమని అన్నారు. మల్టీప్లెక్స్‌లు ఉన్న ఒక ఎగ్జిబిటర్ సింగిల్ స్క్రీన్ కష్టాల గురించి మాట్లాడటం, అలాగే పర్సంటేజీ ప్రకటించిన 23 థియేటర్లు లీజులోనే ఉండటం హాస్యాస్పదమని అన్నారు.

## విచారణకు హాజరుకాలేకపోతున్నాను

**పోలీసులకు బండి భగీరథ్ లేఖ**
**వ్యక్తిగత కారణాల వల్ల హాజరుకాలేకపోతున్నట్లు వెల్లడి**
**విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు మరో రెండు రోజులు కావాలని విజ్ఞప్తి**
**దర్యాప్తుకు సహకరిస్తానన్న బండి భగీరథ్**
**విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని కేటాయించాలని విజ్ఞప్తి**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్, తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం పోలీసుల విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల తాను హాజరుకాలేకపోతున్నానని, విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు రెండు రోజుల గడువు కావాలని పోలీసులకు లేఖ రాశాడు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులకు మెయిల్ పంపించాడు. మే 8వ తేదీన మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు నిన్న నోటీసులు జారీ చేశారు. అయితే, తక్కువ సమయంలో నోటీసులు అందాయని, తనపై వచ్చిన తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా ఆధారాలు, సమాచారం సేకరించేందుకు సమయం కావాలని భగీరథ్ పోలీసులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని ఆయన స్పష్టం చేశారు. విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని సూచించాలని కోరారు. మరోవైపు, ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కఠినమైన పోక్సో సెక్షన్ 5(1), 6ను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే 20 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో దర్యాప్తు వేగవంతమైంది. ఇదిలా ఉండగా, భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది. తప్పుడు కేసు పెట్టి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని బాధితురాలి కుటుంబంపై భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

## పాత ప్రేమ... ప్రాణాల మీదికి తెచ్చింది

**పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో దారుణం**
**పదో తరగతిలో ప్రేమించుకున్న వంశీ, అలేఖ్య**
**తర్వాత నవీన్‌తో అలేఖ్య వివాహం**
**గత సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలిసిన అలేఖ్య, వంశీ**
**అలేఖ్య నెంబర్ తీసుకుని సందేశాలు పంపించిన వంశీ**
**స్నేహితుడితో కలిసి వంశీని హత్య చేసిన అలేఖ్య భర్త**



పెద్దపల్లి, జై భీమ్ న్యూస్

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగిరెడ్డిపల్లికి చెందిన వంశీ, అలేఖ్య పదో తరగతిలో ప్రేమించుకున్నారు. కొన్నాళ్లకు అలేఖ్యకు నవీన్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. గత సంవత్సరం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా అలేఖ్య ఫోన్ నెంబర్ తీసుకున్న వంశీ, ప్రేమ పేరుతో వేధించాడు. దీంతో నవీన్ తన స్నేహితుడితో కలిసి వంశీని హత్య చేశాడు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సింగిరెడ్డిపల్లికి చెందిన వంశీ, అలేఖ్య పదో తరగతి చదువుతున్న సమయంలో ప్రేమించుకున్నారు. ఆ తర్వాత నవీన్‌ను అలేఖ్య ప్రేమించి పెళ్లి చేసుకుంది. 2025 ఫిబ్రవరిలో పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆ సమయంలో అలేఖ్య ఫోన్ నెంబర్‌ను వంశీ తీసుకున్నాడు. తరుచూ ఆమెకు సందేశాలు పంపించేవాడు. ఫోన్ చేసి వేధించేవాడు. కొన్ని సందర్భాలలో హైదరాబాద్‌లో ఉంటున్న అలేఖ్య ఇంటికి వెళ్లి గొడవ చేశాడు. విషయం తెలుసుకున్న అలేఖ్య భర్త నవీన్, తన మిత్రుడు భాస్కర్‌తో కలిసి వంశీని మందలించాడు. అలేఖ్యను అదేపనిగా వేధిస్తుండటంతో వంశీని హతమార్చాలని నవీన్ నిర్ణయించుకున్నాడు. భాస్కర్‌తో కలిసి పథకం వేశాడు. గత నెల 30వ తేదీన వంశీని హైదరాబాద్‌కు రప్పించి, భాస్కర్ ఫ్లాట్ కు తీసుకెళ్లి పథకం ప్రకారం మద్యం తాగించి కత్తితో పొడిచి హత్య చేశారు. నవీన్, భాస్కర్ కలిసి వంశీ మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేసి మ్యాట్‌లో చుట్టి కారు డిక్కీలో పెట్టుకుని, మంథని మండలం గాడుదులగండి ప్రాంతానికి తీసుకువచ్చి, రోడ్డు పక్కన లోయలో పడేశాడు. ఇంట్లో రక్తపు మరకలను తుడిచివేశారు. వంశీ కనిపించకపోవడంతో అతని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుల నుంచి కారు, ఐదు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

## అధికారం పోయినా ఉదయనిధికి జ్ఞానోదయం కలగలేదు: రఘునందన్ రావు

**అసెంబ్లీలో మరోసారి సనాతన ధర్మం గురించి మాట్లాడిన ఉదయనిధి**
**ఉదయనిధి అనుచిత వ్యాఖ్యల వల్లే డీఎంకేని ప్రజలు ఓడించారన్న రఘునందన్**
**సనాతన ధర్మాన్ని విమర్శించడాన్ని మానుకోవాలని హితవు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీలో ప్రసంగించిన డీఎంకే నేత, మాజీ డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, తన పాత వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. మనుషుల మధ్య దూరాన్ని పెంచి, విభజన తెచ్చే సనాతన ధర్మాన్ని అంతం చేయాలన్న తన నినాదాన్ని ఆయన మళ్లీ లేవనెత్తారు. అయితే, ఇదే సమయంలో ఆయన రాజకీయ పరిణతిని కూడా ప్రదర్శించారు. కొత్త ముఖ్యమంత్రి విజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూనే, సభలో అధికార, ప్రతిపక్షాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ తమిళనాడు అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని, సభలో రాజకీయ మర్యాదలు కొనసాగాలని కోరారు. మరోవైపు సనాతన ధర్మాన్ని అంతం చేయాలన్న ఉదయనిధిపై తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. అధికారం కోల్పోయినా ఉదయనిధికి జ్ఞానోదయం కలగలేదు అని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మంపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యల వల్లే ప్రజలు డీఎంకేని తిరస్కరించారని రఘునందన్ గుర్తుచేశారు. అందరి మంచిని కోరుకునే ధర్మమే సనాతన ధర్మమని చెప్పారు. సర్వజనుల శ్రేయస్సును కోరే సనాతన ధర్మాన్ని విమర్శించడం మానుకోవాలని, హిందూ సంప్రదాయాలను గౌరవించాలని ఆయన హితవు పలికారు. భవిష్యత్తులో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఉదయనిధికి సూచించారు. రఘునందన్ రావు ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఉదయనిధిపై విమర్శలు గుప్పించారు.



# వర్ధన్నపేట నియోజకవర్గ సర్పంచులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై అవగాహన వర్క్‌షాప్






**వరంగల్, 13 మే 2026(జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట నియోజకవర్గంలోని సర్పంచులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై ఒకరోజు అవగాహన వర్క్‌షాప్‌ను బుధవారం వర్ధన్నపేట మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ ఒ మేజిస్ట్రేట్ డాక్టర్ సత్యశారద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో గ్రామపంచాయతీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, డిజిటల్ విద్య, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు, క్రీడలు, సైన్స్ విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ సర్పంచులు పాఠశాలల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను సమాజ అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నైపుణ్యాల పెంపొందనలో పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. డిజిటల్ లెర్నింగ్, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), స్టెమ్ విద్య, ఖాన్ అకాడమీ వంటి ఆధునిక విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టూల్స్ వినియోగంతో విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తున్నామని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారని చెప్పారు. విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడు గుడ్లు, రాగిజావా అందిస్తున్నామని వివరించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా డిజిటల్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఫౌండేషనల్ లెర్నింగ్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, లెర్నింగ్ ఎన్‌హాన్స్‌మెంట్ ప్రోగ్రామ్స్, సమ్మర్ క్యాంపులు, రిమీడియల్ టీచింగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల హాజరు, అభ్యాస నైపుణ్యాలు, పరీక్షా ఫలితాల మెరుగుదలకు సర్పంచులు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామంలో పాఠశాల అభివృద్ధి కమిటీలను చురుకుగా పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. వరంగల్ జిల్లా పరిషత్ సీఈఓ రాంరెడ్డి మాట్లాడుతూ అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఉండ్రాతి సుజన్ తేజ, వరంగల్ ఆర్డీవో సుమ, వర్ధన్నపేట తహసీల్దార్ విజయసాగర్, రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్, పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి, వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ, రాయపర్తి ఎంపీడీవో కిషన్, పర్వతగిరి ఎంపీడీవో శంకర్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, వర్ధన్నపేట ఎంఈఓ శ్రీధర్, రాయపర్తి ఎంఈఓ శ్రీనివాస్, పర్వతగిరి ఎంఈఓ బిక్షపతి, వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి మండలాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు






**డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక**

**హైదరాబాద్, 13 మే 2026 (జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలో బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, పశు సంవర్ధక శాఖ కార్యదర్శి కె. ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు ఈ నెల 27న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో రెండు వర్గాల మధ్య ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూరెల్టీ టు యానిమల్స్ యాక్ట్-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. చెక్‌పోస్టుల వద్ద 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు తనిఖీలు నిరంతరాయంగా కొనసాగించాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు అతిక్రమించి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు క్షేత్రస్థాయిలో రెండు వర్గాల ప్రతినిధులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, మున్సిపల్, పశు సంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని డీజీపీ ఆదేశించారు. సీజ్ చేసిన పశువుల సంరక్షణ కోసం తగిన స్థలాల్లో క్యాటిల్ పౌండ్లు ఏర్పాటు చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు చేసే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు బక్రీద్ పండుగ నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. కౌ స్లాటర్ యాక్ట్, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ క్రూరెల్టీ చట్టాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ కార్యదర్శి కె. ఇలంబర్తి మాట్లాడుతూ పశువుల రవాణాకు సంబంధించిన సర్టిఫికెట్లు జారీ చేసేందుకు వెటర్నరీ వైద్యులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో వైద్యులు ఎల్లవేళలా సేవలందిస్తారని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి కె. ఇలంబర్తి, డైరెక్టర్ గోపి, శాంతిభద్రతల డీజీపీ మహేష్ ఎం. భగవత్, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

# దాసరి ప్రసన్న రాణికి డాక్టరేట్



**కేయూ క్యాంపస్ / జై భీమ్ న్యూస్ :**

కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజీ (కో ఎడ్యుకేషన్) భౌతిక శాస్త్ర విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న దాసరి ప్రసన్న రాణి చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ నుండి భౌతిక శాస్త్రంలో డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టర్ దాసరి ప్రసన్న రాణి "మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ స్మార్ట్ సోలార్ ఎనర్జీ సిస్టమ్స్" అనే అంశంపై యూనివర్సిటీ ఆచార్యులు ఆచార్య డి సురేష్ పర్యవేక్షణలో ఆమె పరిశోధన పూర్తి చేశారు. తన పరిశోధనలో భాగంగా ఆస్ట్రేలియాలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ప్రస్తుతం ఆమె కాకతీయ యూనివర్సిటీ కి చెందిన ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు మరియు విద్యార్థులు దాసరి ప్రసన్న రాణిని అభినందించి, ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు , విద్యార్థులు అభినందించారు.

# బండి సంజయ్ వ్యవహారంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి : ఏనుగుల రాకేష్ రెడ్డి

**చట్టం అందరికీ సమానంగా అమలు కావాలని డిమాండ్**




**బాలసముద్రం / జై భీమ్ న్యూస్ :**

టిఆర్ఎస్ పార్టీ ఆఫీస్ బాలసముద్రం ప్రెస్ మీట్ లో ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం చట్ట అమలుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందన్నారు. "చట్టం ఉన్నవారికి ఒకలా, డబ్బులు మరియు అధికారం ఉన్నవారికి మరోలా పని చేస్తోందా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి" అని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారు పారదర్శకంగా ఉండాలని, ముఖ్యంగా చట్టాలను అమలు చేసే అధికారులు మరింత నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైందని, అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. తాను బీజేపీలో 13 సంవత్సరాలు పని చేశానని, బండి సంజయ్‌తో కలిసి పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ స్థాయి దిగజారిపోయిందని ఆరోపించారు. "ఒక అమ్మాయి ఫిర్యాదు చేయడానికి వస్తే ఎనిమిది గంటల పాటు పోలీసులు ఎలాంటి చర్యలు ప్రారంభించకుండా అదే సమయంలో బాధితురాలిపైనే కేసు నమోదు చేయడం ఆశ్చర్యకరం. ఈ చర్యపై పోలీసులు సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. అలాగే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ రాజ్యాంగంపై ప్రమాణం చేశారని, అయితే రాజ్యాంగంలో పోక్సో నిందితులను అరెస్ట్ చేయొద్దని ఎక్కడ ఉందని ప్రశ్నించారు. "ప్రజల సమస్యల విషయంలో బండి సంజయ్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఒకేలా ఆలోచిస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. బండి భగీరత్ కేసులో ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేస్తోందని ఆరోపించిన ఆయన, బండి సంజయ్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. "బండి భగీరత్ తప్పిపోలేదు, దారి తప్పాడు. అతడిని కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని వ్యాఖ్యానించారు. "ఈ వ్యవహారానికి పార్టీకి సంబంధం లేదని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించిన ఆయన, ప్రభుత్వం మరియు సంబంధిత నేతలు ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రెస్‌మీట్‌లో మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్తో పాటు నాయకులు నరెడ్ల శ్రీధర్, పానుగంటి శ్రీధర్, రాజ్ గోపాల్, గండ్రకోట రాకేష్ యాదవ్, ప్రశాంత్, రాజేందర్, గువ్వ రాజేష్, సుమన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మళ్లీ నేపాలీ గ్యాంగ్ హల్‌చల్.. ప్రొఫెసర్ ఇంట్లో భారీ దోపిడీ

**పుట్టినరోజు డ్రామాతో ప్రొఫెసర్ దంపతుల ఇంట్లో దోపిడీ**
**మత్తుమందు ఇచ్చి 60 తులాల బంగారం, నగదు లూటీ**
**పనివాళ్లే సూత్రధారులుగా పోలీసుల అనుమానం**
**ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరంలో నేపాలీ ముఠాల నేరాలు మరోసారి కలకలం సృష్టించాయి. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూరు గల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న ప్రొఫెసర్ దంపతుల ఇంట్లో ఓ ముఠా భారీ దోపిడీకి పాల్పడింది. ఇంట్లో పని చేసేవారే పథకం ప్రకారం ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో దుండగులు సుమారు 60 తులాల బంగారం, వెండి వస్తువులు, రూ.30,000 నగదు దోచుకెళ్లారు. బాధితులు ప్రొఫెసర్ విజయలక్ష్మి, మురళీ మోహన్ 13 రోజుల క్రితమే నేపాల్‌కు చెందిన దంపతులను పనిలో పెట్టుకున్నారు. సోమవారం రాత్రి పనిమనిషి పుట్టినరోజు అని చెప్పి, కేక్ కటింగ్ ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు వారి స్నేహితులుగా మరో ఐదుగురిని ఇంటికి పిలిచారు. ప్రొఫెసర్ దంపతులు భోజనం చేస్తున్న సమయంలో ముఠా సభ్యులు ఒక్కసారిగా వారిపై దాడి చేసి, తాళ్లతో కట్టేశారు. "మీకు కావాల్సింది తీసుకెళ్లండి, మమ్మల్ని చంపకండి" అని బాధితులు వేడుకున్నా వినకుండా, వారికి మత్తుమందు ఇచ్చి ఓ గదిలో బంధించారు. అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, వెండి, నగదును దోచుకుని, సాక్ష్యాలు దొరక్కుండా సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేసి పరారయ్యారు. మంగళవారం మధ్యాహ్నం స్పృహలోకి వచ్చిన దంపతులు కిటికీ నుంచి కేకలు వేయడంతో, చుట్టుపక్కల వారు వచ్చి వారిని రక్షించి పోలీసులకు సమాచారం అందించారు. మల్కాజ్‌గిరి డీసీపీ సుమతి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

# ఎన్.టి.ఏను రద్దు చేయాలి

నీట్ అభ్యర్థులకు న్యాయం చేయాలి
నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహిస్తూ
కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి
ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు స్టాలిన్

**హనుమకొండ,13 మే 2026 (జై భీమ్ న్యూస్)**




ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయం బి.ఎస్.ఎన్.ఎల్ హనుమకొండ ఆఫీస్ వద్ద నిరసన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు నక్కలగుట్టలోని కేంద్ర ప్రభుత్వం కార్యాలయమైన బిఎస్ఎన్ఎల్ ఎదుట నీట్ పేపర్ లీక్ తో రద్దయిన సందర్భంగ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా అధ్యక్షులు స్టాలిన్ మాట్లాడుతూ మే మూడవ తేదీన జరిగిన నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ తో రద్దు చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఎ) ప్రకటించడం ఎన్ టి ఏ యొక్క అసమర్ధత బట్టబయలు అయిందని ఒకే దేశం ఒకే పరీక్ష ఓ విఫల ప్రయత్నమని. 22 లక్షల కు పైగా నీటి పరీక్ష రాసిన అభ్యర్థుల జీవితాలు నీట్ రద్దుతో అంధకారంలోకి వెళ్లాలని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని అలాగే సెంట్రలైజ్డ్ పరీక్షల విధానం మరియు ఎన్.టి.ఎ ను రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వాలే మెడికల్ ఎంట్రెన్స్ టెస్టును నిర్వహించుకునే విధంగా చేయాలని అలాగే నీట్ అభ్యర్థుల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా పరీక్షకు అనుమతించాలని డిమాండ్ చేశారు లక్షల రూపాయలు ఫీజులు కట్టి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని వారికి రెండు సంవత్సరాల పాటు ఉచిత శిక్షణ ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షులు సాయికుమార్ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్ అలాగే బాధ్యులు నాగరాజ్ కుమార్ రవి తదితరులు పాల్గొన్నారు.

# టీజీ సీపీగెట్-2026 నోటిఫికేషన్ విడుదల

పరీక్ష నిర్వహణ బాధ్యతలు కాకతీయ విశ్వవిద్యాలయానికి




**హైదరాబాద్ / జై భీమ్ న్యూస్ :**

హైదరాబాద్‌లోని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో టీజీ సీపీగెట్--2026 నోటిఫికేషన్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి మండలి చైర్మన్ ఆచార్య బాలకృష్ణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు ఆచార్య కుమార్, ఆచార్య ఉమేష్ కుమార్, ఆచార్య జిఎస్ శ్రీనివాస్, ఆచార్య సూర్య ధనుంజయ్ పాల్గొన్నారు. మండలి వైస్ చైర్మన్లు ఆచార్య పురుషోత్తం, కార్యదర్శి ఆచార్య శ్రీరామ్ వెంకటేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఏడాది టీజీ సీపీగెట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను కాకతీయ విశ్వవిద్యాలయం చేపట్టినట్లు తెలిపారు. టీజీ సీపీగెట్-2026 కన్వీనర్ ఆచార్య రాజేందర్ కట్ల మాట్లాడుతూ, దరఖాస్తుల స్వీకరణ మే 15 నుంచి ప్రారంభమవుతుందని, చివరి తేదీ జూన్ 18 అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, ప్రత్యేక అధికారి ఆచార్య బి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు సన్మానం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజయంపై కోరపల్లి రాజేష్ అభినందనలు



**నారాయణగిరి పల్లె / జై భీమ్ న్యూస్ :**

పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను కోరపల్లి రాజేష్ సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు వేల్పుల లహరి 532 మార్కులు, వేల్పుల వర్షత 526 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. నారాయణగిరిపల్లె గ్రామానికి చెందిన వేల్పుల సాంబయ్య కుమార్తె వర్షత, అరుణ్ కుమార్తె లహరి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం పట్ల కోరపల్లి రాజేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇంత మంచి ఉత్తీర్ణత సాధించడం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి






ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**హన్మకొండ, 13 మే 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధుల కోసం ఒకరోజు శిక్షణా, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. “గుడిని ఎంత శ్రద్ధగా చూసుకుంటారో, బడిని కూడా అంతే బాధ్యతగా చూసుకోవాలి” అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చాయని, ప్రస్తుతం ప్రభుత్వ బడులు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. పేద విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడంలో సర్పంచులు, కౌన్సిలర్లు ముందుండాలని కోరారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకుంటూ వారి ప్రతిభను వెలికితీయాలని, బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ పేర్కొన్నారు. మహిళల విద్యతోనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పాఠశాలలను ప్రజాప్రతినిధులు తరచూ సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవాలని, మాదకద్రవ్యాలు, బాల్య వివాహాల వంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించిందని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రతి బాలబాలిక తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు డ్రాప్‌ఔట్ విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు కోసం స్థానిక సంస్థల ప్రతినిధులు, గ్రామ ప్రజలు సమిష్టిగా పనిచేయాలని కోరారు. పాఠశాలల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక వసతుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ప్రత్యేక విద్యా వారోత్సవాల ద్వారా విద్య ప్రాముఖ్యతను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రతి కుటుంబంలో చైతన్యం పెంపొందించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల సంక్షేమం, సమాజ భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, బడిబాట కార్యక్రమం, డిజిటల్ మౌలిక వసతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అభ్యాస విధానాలు, యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలు, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకం, కేజీబీవీ పాఠశాలలు, ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టి, పనుల పురోగతిని సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ గిరిరాజు బాబు, డీడబ్ల్యూఓ విశ్వజ, అడల్ట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, మండలాల ఎంఈవోలు, గ్రామ సర్పంచులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పింగిళి కళాశాలలో ఘనంగా విద్యావారోత్సవాలు - వివిధ కార్యక్రమాల నిర్వహణ!






ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి

**వడ్డేపల్లి 12/మే/2026 (జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) హనుమకొండలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా మూడవ రోజు కళాశాలలో వైద్య అవగాహన కార్యక్రమం, ఇతర కార్యక్రమాలు-ప్రజా ప్రతినిధులను, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులను కలుసుకుని వారికి కళాశాల కరపత్రాలు అందజేసి కళాశాల ప్రాముఖ్యత తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించామని ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి అన్నారు.కళాశాల హెల్త్ క్లబ్ కన్వీనర్ డా.సుభాషిణి ఆధ్వర్యంలో వైద్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం కాబట్టి విద్యార్థులకు ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలని, వైద్య అధికారి సూచించిన సూచనలను తప్పకుండా అనుసరించాలని అన్నారు. హాస్టల్ విద్యార్థులు శుభ్రతను పాటించాలని , ఆరోగ్యమైన ఆహార అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు . వడ్డేపల్లి పి హెచ్ సీ డాక్టర్ సాయి శ్రీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ప్రతి చిన్న ఆరోగ్య సమస్యలకు ఎక్కువగా మెడిసిన్ వాడకుండా, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని ఆరోగ్యంగా ఉంటేనే అన్ని సాధించగలమని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డా. జి. సుహాసిని మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వ్యాయామం సాధనాలను ఉపయోగిస్తూ శారీరకదారుడ్యాన్ని పెంచుకోవాలని అన్నారు . విద్యారంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అధ్యాపకులకు, కార్యాలయ సిబ్బందిని గౌరవిస్తూ కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 9.96 సి జి పి ఎ సాధించిన బి. శాంతిప్రియను సన్మానించడం జరిగింది. ఆక్టివిటీస్ లో చురుకుగా పాల్గొంటూ ఆటల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ అధిక పథకాలను సాధించేవిధంగా ప్రోత్సహించిన కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.జ్యోతిని, నాన్ టీచింగ్ లో విశిష్ట సేవలు అందించిన ఎండి హసీనా బేగం ను ప్రిన్సిపాల్ సన్మానించారు. తదనంతరం విద్యా వారోత్సవాలలో భాగంగా కళాశాల అధ్యాపకులు హనుమకొండ పరిసర గ్రామీణ ప్రాంతాలలో ప్రజా ప్రతినిధులను మరియు ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులను కలుసుకుని తమ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్న విషయాన్ని వివరిస్తూ , కళాశాల ప్రాధాన్యతను తెలిపే కరపత్రాలు అందించడం జరిగిందని ప్రిన్సిపాల్ అన్నారు. ధర్మసాగర్, రఘునాథ్ పల్లి , వెల్ది , ల్యాదల్ల, దామెర, హనుమకొండ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యార్థులను కలుసుకుని తమ కళాశాల ప్రాధాన్యతను వివరించడం జరిగిందనీ, కళాశాలలో బి.ఏ, బి.కాం.కాంప్యూటర్స్,బీకాం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్,ఇన్సూరెన్స్ ,బి.బి.ఎ, బీఎస్సీ లైఫ్ సైన్స్, బి.ఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ డైరీ,పౌల్ట్రీ మేనేజ్మెంట్ కోర్సులు ఉన్నాయని, కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు,అటానమస్ హోదా ఉన్నదనీ ,సుశిక్షితులైన అధ్యాపకులు ఉన్నారని, డిగ్రీ తో పాటు అనేక రకాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందనీ నిరంతరం జాబ్ మేళాల ద్వారా విద్యార్థులకు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి.సుహాసిని, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డా. డి. సురేశ్ బాబు, అకాడమిక్ కో ఆర్డినేటర్ డా. ఎం.అరుణ, విద్యా వారోత్సవాల సమన్వయకర్త డా.డి.రామకృష్ణారెడ్డి, హెల్త్ క్లబ్ కన్వీనర్ డా.సుభాషిణి, అధ్యాపకులు పీడీ సుజాత , ఎస్. మధు,సామ్యూల్ ప్రవీణ్ కుమార్,డా. కె.శ్రీనివాస్, ప్రొ.సునీత, రాజేశ్వరి, డా.మమత, డా .లకన్ సింగ్, డా.పద్మ, రమేష్ కుమార్,అరుణ, డా. సువర్ణ, ఉదయశ్రీ,డా.రేణుక, జ్యోతి,డా.మాధవి, కవిత,కల్పన వివిధ విభాగాల అధిపతులు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇప్పుడు ఆ బ్రాండ్లన్నీ ఏపీ నుంచే: మంత్రి నారా లోకేష్

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో తయారీ రంగం దూసుకెళుతోందని, ‘మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్’ అనేది ఇప్పుడు నాణ్యతకు, నమ్మకానికి చిహ్నంగా మారుతోందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని తయారీ రంగం పురోగతిని వివరిస్తూ ఆయన బుధవారం సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. దీనికి సంబంధించిన ఓ ప్రత్యేక వీడియోను కూడా పంచుకున్నారు. “మొబైల్ ఫోన్లు, స్క్రీన్ల నుంచి మొదలుకొని ఏసీలు, బైక్‌లు, కార్ల వరకు.. భారతీయులు విశ్వసించే ఎన్నో బ్రాండ్లు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయి” అని లోకేష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పనుల వేగవంతమైన అమలు, బలమైన తయారీ వ్యవస్థ వల్లే ఇది సాధ్యమైందని వివరించారు.

# తెలంగాణలో ఉబెర్ భారీ విస్తరణ

**సీఎం రేవంత్‌తో సీఈవో భేటీలో కీలక చర్చలు**
**సీఎం రేవంత్ రెడ్డితో ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి భేటీ**
**హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణకు ఉబెర్ నిర్ణయం**
**పార్కింగ్ రంగంలోకి రావాలని ఉబెర్‌కు సీఎం రేవంత్ సూచన**
**భారత్ ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటుపై ఉబెర్ ఆసక్తి**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబెర్ తెలంగాణలో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు ఉబెర్ సీఈవో దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో కంపెనీ విస్తరణ, నగరాల్లో పార్కింగ్ సమస్యలు, రాబోయే భారత్ ఫ్యూచర్ సిటీలో అవకాశాలపై కీలక చర్చలు జరిపారు. హైదరాబాద్‌లో తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను విస్తరిస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎంకు దారా ఖోస్రోషాహి తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన మొట్టమొదటి సీఓఈ ఇదేనని, ప్రస్తుతం ఇక్కడ 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని, భవిష్యత్తులో దీనిని మరింతగా పెంచనున్నామని వివరించారు. ఈ సందర్భంగా నగరాల్లో, ముఖ్యంగా మెట్రో స్టేషన్ల వద్ద ఎదురవుతున్న పార్కింగ్ ఇబ్బందులను సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఈవీ ఛార్జింగ్ స్టేషన్లతో కూడిన మల్టీ-లెవల్ పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉబెర్‌కు సూచించారు. పట్టణ రద్దీని తగ్గించేందుకు పార్కింగ్ నిర్వహణ రంగంలోకి ప్రవేశించే అవకాశాలపై అధ్యయనం చేయాలని కోరారు. సీఎం ప్రతిపాదనపై ఉబెర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 30,000 ఎకరాల భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు గురించి సీఎం వారికి వివరించారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపిన దారా ఖోస్రోషాహి, అక్కడ తమ కార్పొరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తమ భవిష్యత్ విస్తరణకు ప్రభుత్వ సహకారం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, సీటీఓ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారం రోజుల భారత పర్యటనలో భాగంగా ఖోస్రోషాహి పలువురు కేంద్ర, రాష్ట్ర నాయకులతో మొబిలిటీ, టెక్నాలజీ, పెట్టుబడులపై చర్చిస్తున్నారు. కాగా, పార్కింగ్ ప్రాజెక్టులు, కొత్త కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితులను ప్రకటించనప్పటికీ, తెలంగాణలో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.



## బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేయాలి: కవిత

**కుమారుడి నేరం రుజువైతే బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలన్న కవిత**
**మోదీతో బండి సంజయ్ వేదికను పంచుకోవడం తప్పుడు సంకేతాలు పంపిందని వ్యాఖ్య**
**తెలంగాణలో రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకే తమ పార్టీ పుట్టిందన్న కవిత**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత ;విమర్శనాస్త్రాలు సంధించారు. పోక్సో కేసులో ఉన్న బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా పోలీసులు వెంటనే లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఒకవేళ నేరం రుజువైతే బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తండ్రిగా బండి సంజయ్ ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకోవడం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిందని ఆమె అభిప్రాయపడ్డారు. బాధితురాలి జీవితాన్ని దెబ్బతీసేలా వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని, ఆ అకౌంట్లను బ్లాక్ చేయాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలని కవిత అన్నారు. ఇప్పటివరకు ఆయన ఈ ప్రాజెక్టును ఒక్కసారి కూడా సందర్శించకపోవడం ఏమిటని ఆమె ఆక్షేపించారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం నీటి వనరుల వినియోగంలో విఫలమవుతోందని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కులగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరిగా ఉండాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా పోరాడతామని కవిత తెలిపారు. నీట్ పేపర్ లీక్ గురించి ఆమె మాట్లాడుతూ... జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీక్ ఘటనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికే తమ పార్టీ పుట్టిందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అమరావతిలో భారీ మెడికల్ ప్రాజెక్టు..

**బొల్లినేని కాలేజీకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన**
**అమరావతి నిడమర్రులో బొల్లినేని మెడికల్ కాలేజీకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన**
**లక్ష మందికి నైపుణ్య శిక్షణ అందించి గ్లోబల్ మెడికల్ హబ్‌గా మార్చడమే లక్ష్యం**
**గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలని పారిశ్రామికవేత్తలకు స్పష్టమైన ఆదేశాలు**
**అమరావతితో పాటు విశాఖ, రాయలసీమ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు వెల్లడి**
**డిసెంబరు నాటికి దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు చేస్తామని ప్రకటన**

విజయవాడ, జై భీమ్ న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి వైద్య, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే బృహత్ ప్రణాళికకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా, నిడమర్రులో "బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్" (బొల్లినేని మెడికల్ కాలేజీ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ) నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ గంటి హరీష్, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై తన దార్శనికతను, ప్రభుత్వ ప్రణాళికలను ఆవిష్కరించారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన కిమ్స్ ఆస్పత్రి ఇప్పుడు రూ.30 వేల కోట్ల సంస్థగా ఎదిగిన విషయాన్ని గుర్తుచేస్తూ, పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తేనే రాష్ట్రానికి, దేశానికి సంపద సృష్టి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధికి అనేకమంది పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "గతంలో రాష్ట్రంలో 23 నెలల పాటు విధ్వంసం, అరాచకం చూశాను. అలాంటి పాలన నా జీవితంలో చూడలేదు. ఇప్పుడు శంకుస్థాపనలతో ఆగిపోకుండా, నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా జరుపుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. ఈ మెడికల్ కాలేజీ, యూనివర్సిటీ నిర్మాణం 2027 నాటికి పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఇటీవలే శంకుస్థాపన చేసిన గూగుల్ క్యాంపస్‌ను 2028 ఆగస్టుకు, ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ మొదటి దశను 2028 డిసెంబరుకు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. "అనుమతులు ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత మాది. నిర్మాణాలు పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించే బాధ్యత పారిశ్రామికవేత్తలది" అని భరోసా ఇచ్చారు. మొత్తం 25 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ఇందులో 23 ఎకరాల్లో మెడికల్ కాలేజీ, 2 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 250 మెడికల్ సీట్లు, 1000 నాన్-మెడికల్ సీట్లు, మరో 1000 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా లక్ష మందికి నైపుణ్యం అందించి, ప్రపంచవ్యాప్తంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఉన్న డిమాండ్‌ను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. "ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్య సిబ్బందిలో ఒకరికి అమరావతిలోనే శిక్షణ ఇచ్చే స్థాయికి ఈ సంస్థ ఎదగాలి," అని సీఎం ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను వరించారు. టెక్నాలజీ: దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పరిశ్రమలు: రాయలసీమలో ఈ నెల 15న ఫైటర్ జెట్ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నట్లు, కర్నూలును డ్రోన్ సిటీగా, శ్రీసిటీని ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నగరాభివృద్ధి: అమరావతితో పాటు విశాఖను కూడా విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. హరిత ఇంధనం: విదేశాలపై ఆధారపడకుండా, ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్‌లతో విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ప్రజలపై మోపిన రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాన్ని తగ్గించామని, ఛార్జీలు పెంచకుండా తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య రంగం: రాష్ట్ర బడ్జెట్‌లో వైద్యారోగ్యశాఖకు రూ.20 వేల కోట్లు కేటాయించామని, సంజీవని ద్వారా డిజిటల్ వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని స్మరించుకున్న చంద్రబాబు, వారి భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అమరావతిని భవిష్యత్ నగరంగా నిర్మించి, రాష్ట్ర యువతకు లక్షల ఉద్యోగాలు కల్పించడమే తన ఆలోచన అని స్పష్టం చేశారు.



## హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్..

**మే నెలాఖరులోగా ఇళ్ల మంజూరు పత్రాలు**
**జూన్ 2న ఆదిలాబాద్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం**
**మే 21న జరిగే కేబినెట్ సమావేశంలో విధివిధానాల ఖరారు**
**లబ్ధిదారుల నివాస ప్రాంతాలకు 5-8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లు**
**హైదరాబాద్‌లో సొంత స్థలం ఉన్నవారికి మే చివరికల్లా మంజూరు పత్రాలు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్టు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను మే 21న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల హౌసింగ్, రెవెన్యూ అంశాలపై మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో పొంగులేటి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో సొంత స్థలం ఉండి, అర్హులైన లబ్ధిదారులకు మే నెలాఖరులోగా ఇంటి మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వం హైదరాబాద్‌కు 20-30 కిలోమీటర్ల దూరంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించిందని, దీనివల్ల పేదలకు ప్రయోజనం చేకూరలేదని మంత్రి విమర్శించారు. ఈసారి అలా కాకుండా, లబ్ధిదారులు నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లు నిర్మించుకునేలా స్థలాలు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ భూములు అంగుళం అన్యాక్రాంతమైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షలో మల్కాజ్‌గిరిలోని యూఎల్‌సీ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల అంశం ప్రస్తావనకు రాగా, బాధ్యులైన రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## నా కుమారుడ్ని నేరస్తుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారు

**బండి సంజయ్ ఆవేదన**
**తన కొడుకు తప్పు చేయలేదని చెబుతున్నాడన్న బండి సంజయ్**
**చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తానని స్పష్టం చేసిన సంజయ్**
**రాజకీయ కారణాలతోనే తన కుటుంబాన్ని రోడ్డు మీదకు లాగుతున్నారని ఆరోపణ**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తన కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తొలిసారిగా స్పందించారు. తన కుమారుడిని ఒక నేరస్తుడిగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో జరిగిన హిందూ ఏక్తా యాత్రలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం" అని బండి సంజయ్ పేర్కొన్నారు. తన కుమారుడిపై జరుగుతున్న దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోందని, తన భార్య డిప్రెషన్‌లోకి వెళ్తోందని ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. రాజకీయ కారణాలతోనే తన కుటుంబాన్ని రోడ్డు మీదకు లాగుతున్నారని ఆరోపించారు. నేను భయపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారని, నేనెప్పుడూ భయపడనని అన్నారు. కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టనని బండి సంజయ్ హెచ్చరించారు. గత డిసెంబర్ 31న హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణను పర్యవేక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది.

## బాలుడి హత్య కేసు..

**ట్రాన్స్‌జెండర్‌కు ఉరిశిక్ష..**
**ఆటో డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు**
**హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఘటన**
**చిట్టీ డబ్బుల వివాదమే హత్యకు ప్రధాన కారణం**
**2023లో జరిగిన హత్య కేసులో కోర్టు తీర్పు**
**సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో సంచలనం సృష్టించిన ఎనిమిదేళ్ల బాలుడి హత్య కేసులో న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. చిట్టీ డబ్బుల వివాదంలో బాలుడిని కిరాతకంగా హత్య చేసిన ప్రధాన నిందితురాలు, ట్రాన్స్‌జెండర్ ఇమ్రాన్ ఖాన్‌కు ఉరి శిక్ష విధిస్తూ మేడ్చల్-మల్కాజ్‌గిరి మూడో అదనపు కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. ఈ నేరంలో ఆమెకు సహకరించిన ఆటో డ్రైవర్ మహ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. పోలీసుల కథనం ప్రకారం.. 2023 ఏప్రిల్ 20న ఈ దారుణం చోటుచేసుకుంది. బాలుడి తండ్రి వసీం ఖాన్‌కు, చిట్టీల వ్యాపారం చేసే ఇమ్రాన్‌కు మధ్య సుమారు రూ.7 లక్షల ఆర్థిక లావాదేవీల గొడవ ఉంది. ఈ కక్షతో వసీం ఖాన్ కుమారుడు అబ్దుల్ వహీద్‌ను ఇమ్రాన్ లక్ష్యంగా చేసుకుంది. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న బాలుడితో తనకు ఆరోగ్యం బాగోలేదని నమ్మించి ఓఆర్ఎస్ ప్యాకెట్ తెప్పించుకుంది. బాలుడు తిరిగి రాగానే గొంతు నులిమి హత్య చేసి, అనంతరం కాళ్లు, చేతుల ఎముకలు విరిచి మృతదేహాన్ని ఓ బకెట్‌లో కుక్కింది. ఆ తర్వాత మృతదేహాన్ని పాలిథిన్ సంచిలో చుట్టి, ఆటో డ్రైవర్ రఫీక్ సహాయంతో ఫతేనగర్ సమీపంలోని నాలాలో పడేశారు. బాలుడి అదృశ్యంపై కేసు నమోదు చేసుకున్న సనత్‌నగర్ పోలీసులు, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఈ దారుణ హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. పక్కా ఆధారాలతో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేయడంతో, విచారణ జరిపిన న్యాయమూర్తి మండవ వెంకటేశ్వరరావు.. ఇమ్రాన్‌కు ఉరిశిక్షతో పాటు రూ.10,000, రఫీక్‌కు ఏడేళ్ల జైలుతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. ఈ తీర్పుపై బాలుడి తండ్రి వసీం ఖాన్ హర్షం వ్యక్తం చేస్తూ, తమకు న్యాయం జరిగిందని అన్నారు.

## రాసి పెట్టుకోండి.. ధూళిపాళ్ల ఓడిపోవడం ఖాయం: అంబటి రాంబాబు

విజయవాడ, జై భీమ్ న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని మామిళ్లపల్లి ఘటన ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. మొక్కజొన్న రైతులపై దాడులు జరిగాయని, అక్రమ కేసులు పెట్టారంటూ వైసీపీ చేపట్టిన 'చలో మామిళ్లపల్లి' కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు... ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై విరుచుకుపడ్డారు. రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడులు చేయించడం ఏంటని అంబటి ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపైనే దాడులు చేస్తారా అంటూ మండిపడ్డారు. "వచ్చే ఎన్నికల్లో ధూళిపాళ్ల నరేంద్ర ఓడిపోవడం ఖాయం, ఇది రాసుకోండి" అంటూ మూడేళ్ల ముందే ఆయన జోస్యం చెప్పారు. రైతుల కాలి ధూళికి ఆయన కొట్టుకుపోతారని వ్యాఖ్యానించారు. మా కుటుంబంపై, మా కులంపై , మా పార్టీపై కక్ష కట్టి ఇలాంటి దాడులు చేస్తున్నారా అని అంబటి నిలదీశారు. గుంటూరు ఐజీ త్రిపాఠి ఖాకీ డ్రెస్ వేసుకోవడం లేదని, పచ్చ డ్రెస్ (టీడీపీ రంగు) వేసుకుంటున్నారని ఆరోపించారు. లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శించారు. తప్పు చేస్తే ఎంతటి పెద్ద అధికారినైనా చట్టప్రకారం శిక్షిస్తామని, తప్పుడు కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గోడౌన్‌లో సీజ్ చేసిన మొక్కజొన్నను వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టులకు భయపడేది లేదని, అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# కాకతీయ కళల జాతర రాష్ట్ర స్థాయిని దాటి ఖండాంతర స్థాయిలో గుర్తింపు పొందాలి







**- ఎమ్మెల్యే నాయిని**

**హనుమకొండ / జై భీమ్ న్యూస్ :**

హనుమకొండలో నిర్వహించిన "కాకతీయ కళల జాతర – ఓరుగల్లు మహా సాంస్కృతిక సమ్మేళనం" కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని కళలు, కళాకారుల ప్రాముఖ్యతను కొనియాడారు. కళలకు ఓరుగల్లు పుట్టినిల్లని, కళలను మరియు కళాకారులను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందువరుసలో ఉంటుందని ఆయన అన్నారు. జానపద కళాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం లో చేతన కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సాంస్కృతిక సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందు ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కవులు, కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అంతరించిపోతున్న కళారూపాలను గుర్తు చేసే ప్రయత్నం చేయడం గర్వకారణమన్నారు. కళాకారుల కోసం ప్రత్యేక నిధులతో కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. వరంగల్ నేల చారిత్రక వైభవంతో పాటు కళలు, సాహిత్యం, జానపద సంప్రదాయాలకు చిరునామాగా నిలిచిందని చెప్పారు. కాకతీయుల కాలంలో ఈ ప్రాంతం సంస్కృతి, కళలు, శిల్ప సంపదతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఆ వారసత్వాన్ని కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం యువత ఆధునికత వైపు అడుగులు వేస్తున్న నేపథ్యంలో సంప్రదాయ కళలను, జానపద సంస్కృతిని పరిరక్షించడం అత్యంత అవసరమన్నారు. పల్లెల్లో పుట్టిన కళలు, భాషలోని భావోద్వేగం, సంస్కృతిలోని గొప్పతనం భావితరాలకు చేరాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి లక్ష్యంతో నిర్వహిస్తున్న కాకతీయ కళల జాతర అభినందనీయమని కొనియాడారు. కళాకారుడు సమాజానికి అద్దం లాంటివాడని, తన కళ ద్వారా ప్రజల భావాలు, సమస్యలు, సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తాడని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ప్రతిభలు ఉన్నప్పటికీ సరైన వేదికలు లేక వెలుగులోకి రావడం లేదని, ఈ జాతర అలాంటి కళాకారులకు మంచి అవకాశంగా మారాలని ఆకాంక్షించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఒగ్గుకథలు, బుర్రకథలు, జానపద గీతాలు, డప్పు కళలు వంటి సంప్రదాయ కళారూపాల్లో గొప్ప చరిత్ర ఉందన్నారు. ఇవి కేవలం వినోదానికి మాత్రమే కాకుండా సమాజానికి చైతన్యం కలిగించే సాధనాలుగా నిలుస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కళలు, కళాకారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, కళాకారుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. కళలను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతిని భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కాకతీయ కళల జాతర విజయవంతం కావాలని, ఈ వేదిక రాష్ట్ర స్థాయిని దాటి ఖండాంతర స్థాయిలో గుర్తింపు పొందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, మాజీ ఎంపీ బలరాం నాయక్, మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, పొట్లపల్లి శ్రీనివాస్, విజయ్ బాబు, గట్టు మహేష్, చిర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్ టీజింగ్‌పై ఉక్కుపాదం మోపిన కేయూ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్

**ఎనిమిది మంది ఆకతాయిలపై కేసు నమోదు**

**మహిళల భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**




**హన్మకొండ జిల్లా/ కేయూ, 13 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ నగరంలో మహిళల భద్రతకు భంగం కలిగించే ఘటనలపై కఠినంగా వ్యవహరిస్తున్న కేయూ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్ మరోసారి తన కఠిన వైఖరిని చాటిచెప్పారు. గోపాల్‌పూర్‌కు చెందిన ఓ యువతిని వేధించిన ఘటనలో ఎనిమిది మంది ఆకతాయిలపై ఈవ్ టీజింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన యువతిని కొందరు యువకులు వేధిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సమాచారం. బాధితురాలు ఎదుర్కొన్న ఇబ్బందులపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేయూ పోలీసులు వెంటనే స్పందించి కేసు నమోదు చేశారు. మహిళల పట్ల అసభ్య ప్రవర్తనను ఏమాత్రం సహించబోమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనలో నిందితులుగా తోటపల్లి వేణు శంకర్, నరాల రాజేష్, మినుగు అజేయ్, నరాల దినేష్, ముంతా నితిన్, ముంతా చరణ్, తుర్క మణికంఠ, పునుగంటి సందీప్‌లను పోలీసులు గుర్తించారు. వీరిలో కొందరు విద్యార్థులు కాగా మరికొందరు ప్రైవేటు ఉద్యోగాల్లో ఉన్నట్లు సమాచారం. ములుగు, వరంగల్, హనుమకొండ ప్రాంతాలకు చెందిన ఈ యువకులు ప్రస్తుతం నగరంలో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా కేయూ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్ మాట్లాడుతూ మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవ్ టీజింగ్, రోడ్లపై వేధింపులు, సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారని తెలిపారు. మహిళలు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. యువత చెడు స్నేహాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రవర్తించాలని సూచించారు. మహిళల గౌరవాన్ని కించపరిచే చర్యలు సమాజంలో తీవ్రమైన ప్రభావం చూపుతాయని, అలాంటి ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. మహిళల భద్రత కోసం వరంగల్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల వద్ద పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

**నేరాలకు దూరంగా ఉండాలని హెచ్చరిక**

**శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలని సూచన**

**హసన్ పర్తి, 13 మే 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ కమిషనరేట్ పరిధిలోని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ. మహేందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన రౌడీ షీటర్లకు చట్టపరమైన అవగాహన కల్పిస్తూ సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు తమ పాత వైఖరిని మార్చుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. భూ కబ్జాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, అక్రమ వసూళ్లు వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలను పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని తెలిపారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉండి ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని, కుటుంబ బాధ్యతలను గుర్తించి సక్రమమైన జీవనం సాగించాలని సూచించారు. సమాజంలో మంచి పేరు సంపాదించుకోవడం ద్వారా కుటుంబ సభ్యులకు గౌరవం తీసుకురావాలని హితవు పలికారు. చిన్న చిన్న వివాదాలను పెద్ద గొడవలుగా మార్చకుండా చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని చెప్పారు. అదేవిధంగా భవిష్యత్తులో ఎవరైనా నేర కార్యకలాపాల్లో పాల్గొన్నా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరిస్తూ ప్రశాంత వాతావరణం నెలకొనేలా కృషి చేయాలని సూచించారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కాజీపేట పోలీస్ స్టేషన్‌కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా జె. శ్యామ్ సుందర్ బాధ్యతల స్వీకరణ





**కాజీపేట, 13 మే 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కాజీపేట పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా జె. శ్యామ్ సుందర్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న పోలీస్ శాఖ బదిలీల ప్రక్రియలో భాగంగా ఆయనను కాజీపేట పోలీస్ స్టేషన్‌కు నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమైన శ్యామ్ సుందర్, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసింగ్ సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా పోలీస్ శాఖ పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండే విధంగా పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, నేర నియంత్రణ, యువతలో మాదకద్రవ్యాల వినియోగ నిరోధం, మహిళల భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. స్థానిక ప్రజలు, వ్యాపార వర్గాలు, యువత, కాలనీ సంఘాలు పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కాజీపేట వంటి కీలక ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో కాజీపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన అధికారుల సేవలను కూడా స్థానికులు గుర్తు చేసుకున్నారు. గత ఇన్‌స్పెక్టర్లు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారం, నేరాల నియంత్రణలో చేపట్టిన చర్యలు మంచి గుర్తింపు పొందాయని తెలిపారు. కాజీపేట వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతంలో నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన జె. శ్యామ్ సుందర్ నాయకత్వంలో పోలీస్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందనే ఆశాభావాన్ని స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నూతన ఇన్‌స్పెక్టర్ జె. శ్యామ్ సుందర్‌ను అభినందించిన వారిలో ఎస్‌ఐలు నవీన్ కుమార్, లవన్ కుమార్, శివ, యాదగిరి తదితరులతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హసన్‌పర్తిలో భారీ చోరీ కేసు ఛేదన

**రూ.1.80 లక్షల విలువైన హాన్స్ వైట్‌నింగ్ స్వాధీనం**

**నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**వరంగల్, 13 మే 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఎల్లగుట్టల క్రాస్ రోడ్డులో జరిగిన ఈ ఘటనలో రూ. 1.80 లక్షల విలువైన హాన్స్ వైట్‌నింగ్ సరుకును అపహరించిన నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, బుడగరం చోరీ ముత్తయ్య అనే వ్యక్తి నివాసంలో మే 1వ తేదీన ఈ చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో దుండగులు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి హాన్స్ వైట్‌నింగ్ డబ్బాలను ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసును సవాల్‌గా తీసుకున్న ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలను పరిశీలిస్తూ నిందితుల జాడను పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో బోరుపార్తి గ్రామానికి చెందిన సాతుల అడివయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు తనతో పాటు మరో ఇద్దరితో కలిసి చోరీ చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఒక హాన్స్ వైట్‌నింగ్ కార్టన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని, త్వరలోనే వారిని కూడా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలో విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.



## గర్భిణులు కాఫీ తాగొచ్చా?

గర్భధారణ సమయంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కాబోయే




తల్లులలో తరచుగా తలెత్తే ప్రశ్న ఏమిటంటే కాఫీ తాగడం మంచిదేనా అని. ముఖ్యంగా కెఫీన్ కంటెంట్ కారణంగా వారి శిశువు మెదడు అభివృద్ధికి సురక్షితమేనా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతుంటాయి. కెఫీన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల పిండంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? కాఫీ అనేది కెఫిన్ ప్రసిద్ధ మూలం. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. మితమైన మొత్తంలో కెఫిన్ చాలా మందికి సురక్షితంగా పరిగణిస్తుంటారు. గర్భధారణ సమయంలో తల్లి ఏది తిన్నా అది కడుపులో పెరుగుతున్న బిడ్డపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని చెబుతున్నారు వైద్యులు. గర్భిణీ స్త్రీలు కెఫిన్ చాలా నెమ్మదిగా జీర్ణం కావడమే దీనికి కారణం. రక్తప్రవాహంలో ఎక్కువసేపు ఉంటుంది. కెఫీన్‌ను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఎంజైమ్‌లు పిండంలో లేనందున బిడ్డపై ప్రభావం చూపుతుందంటున్నారు. కెఫీన్ వినియోగం పిండం మెదడు అభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తుంది? గర్భధారణ సమయంలో అధిక కెఫిన్ శిశువు మెదడు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. ఇది భవిష్యత్ పలు సమస్యలకు దారి తీసేలా ఉంటుంది. న్యూరోఫార్మకాలజీలో ప్రచురించిన పరిశోధన ప్రకారం.. చాలా కెఫిన్ మెదడు సర్క్యూట్లకు అంతరాయం కలిగిస్తుందని సూచిస్తుంది. కొన్ని అధ్యయనాలు గర్భంలో అధిక స్థాయిలో కెఫిన్‌కు గురయ్యే శిశువులకు అటెన్షన్ డిజార్డర్స్, హైపర్యాక్టివిటీ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని సూచిస్తున్నాయి. అయినప్పటికీ, ఈ ప్రమాదాలు ప్రధానంగా అధిక కెఫిన్ వినియోగంతో ముడిపడి ఉన్నాయని డాక్టర్ విష్ణోయ్ చెబుతున్నారు.

## ఉప్పు తినడం పూర్తిగా మానేశారా?



ఒక హెల్తీ అడల్ట్ రోజుకు 4 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తినకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలిపింది. అలాగని ఉప్పు పూర్తిగా మానేయకూడదు అంటున్నారు నిపుణులు. అయితే 30 రోజులు సాల్ట్ తినడం మానేస్తే ఏమవుతుందో ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. బరువు తగ్గుతారు : ఉప్పు తినడం ఆపేస్తే బరువు తగ్గుతారు అంటున్నారు నిపుణులు. ఒక నెల పాటు సాల్ట్ తినకపోతే శరీరం తక్కువ సోడియంకు అడ్జస్ట్ అవడం మొదలు అవుతుంది దీంతో సోడియం లెవెల్స్ డ్రాప్ అవుతాయి. ఆ పరిస్థితులకు శరీరం సర్దుకుంటుంది కూడా. సాధారణంగా సోడియం నీటి శాతాన్ని హోల్డ్ చేయడానికి సహాయపడుతుంది. శరీరంలో అది ఎక్కువ లేకపోతే నీటి శాతం తగ్గుతుంది కాబట్టి వెయిట్ లాస్ అవుతారు. సాల్టీ ఫుడ్స్‌లో చాలా కేలరీలు ఉంటాయి. వీటికి దూరంగా ఉంటే కేలరీల ఇన్‌టెక్ తగ్గి బరువు తగ్గుతారు. ఎందుకంటే సాల్టీ ఫుడ్స్ మానేస్తే హెల్తీ ఫుడ్స్ తింటాం కాబట్టి శరీరంలోని, ముఖ్యంగా కడుపు, నడుము చుట్టూ ఉన్న కొవ్వు తగ్గడానికి స్కోప్ ఉంటుంది. బ్లోటింగ్ వంటి సమస్యలకు గుడ్ బాయ్ చెప్పవచ్చు. అయితే, చాలా త్వరగా బరువు తగ్గితే ఆరోగ్యానికి హానికరం అని మాత్రం గుర్తు పెట్టుకోండి. జీర్ణ సమస్యలు : ఉప్పు డైజెషన్‌కు కూడా అవసరమే. ఉప్పులోని సోడియం స్టమక్ యాసిడ్ తయారు కావడానికి అవసరం. సడన్‌గా సాల్టిపుట్స్ మానేస్తే డైజెస్టివ్ సిస్టమ్ అడ్జస్ట్ అవదు. సాల్ట్‌కు బదులు ఫైబర్-రిచ్ ఫ్రూట్స్ వంటివి తింటే వాటిని అరిగించుకోవడానికి డైజెస్టివ్ సిస్టమ్‌కు కష్టమైపోతుంది. దీంతో కడుపు నొప్పి, ఇతర అజీర్తి సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. మానసిక ఆరోగ్యం: ఉప్పును పూర్తిగా మానేస్తే బ్రెయిన్ మీద ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇది ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలకు దారితీస్తుంది. సోడియం శరీరంలోని ఫ్లూయిడ్స్ మెయింటెన్ చేయడానికి అవసరం. ఇది నాడీ వ్యవస్థ పనితీరుకు కూడా ముఖ్యం. సోడియం తక్కువైతే నాడీ కణాల మధ్య కమ్యూనికేషన్ సరిగ్గా జరగక మూడ్ పాడవుతుంది.

## ఈ కాయతో బోలెడన్నీ ప్రయోజనాలు



చేదు ఆరోగ్యానికి మంచి అని తెలిసిన కూడా చాలా మంది తినడానికి ఇష్టపెట్టుకోరు. చేదుగా ఉండే పదార్థాల జోలికి అసలు దగ్గరగా ఉండరు. చేదుగా ఉండే పదార్థాలకు కిలోమీటరు దూరంలో ఉంటారు. అయితే కూరగాయాల్లో కాకరకాయ చేదుగా ఉంటుంది. అసలు దీనిని తినడానికి ఎవరూ ఇష్టపడరు. కాకరకాయను ఎలా వండిన కూడా చేదుగా ఉంటుంది. కనీసం ఏడాదికి కూడా ఒక్కసారి కూడా వీటిని తినరు. ఇందులోని పోషకాలు శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ కాకరకాయను వారానికి ఒకసారి అయిన తినడం వల్ల అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని డైలీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా ఉపయోగపడుతుంది. ఇవే కాకుండా వ్యాధికారక ప్రమాదాల నుంచి కాపాడటంలో కాకరకాయలు ముఖ్య పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఇవే కాకుండా ఇంకా బోలెడన్నీ ప్రయోజనాలు ఉన్నాయి. మరి ఈ ప్రయోజనాలేంటో తెలియాలంటే ఆలస్యం చేయకుండా ఈ ఆర్టికల్‌పై ఓ లుక్కేయండి. కాకరకాయలో ఎక్కువగా పాలీపెప్టైడ్-పి అనే ఇన్సులిన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా సహాయపడతాయి. కాకరకాయ మధుమేహం ఉన్నవారి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యల నుంచి కాపాడుతుంది. చేదు అనారోగ్య వ్యాధుల నుంచి కాపాడుతుంది. ఇందులోని పోషకాలు చర్మ ఆరోగ్యాన్ని మేలు చేస్తాయి. అలాగే ఈ కాకరకాయ మొక్క ఆకులను పేస్ట్ చేసి తలకు అప్లై చేస్తే చుండ్రు తగ్గుతుంది. చేదు వల్ల తలలో పేలు వంటివి ఉన్న కూడా మాయమైపోతాయి. మీకు నచ్చిన విధంగా కాకరకాయను వండి తినడం వల్ల తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు. దీనిని తినలేమని అనుకునేవారు జ్యూస్ చేసి కూడా తాగవచ్చు. దీని జ్యూస్ తాగితే కిడ్నీ సమస్యలు, మోకాలి నొప్పులు తొందరగా తగ్గుతాయి. ఎలాంటి ఆపరేషన్, మందులు వాడకుండా కిడ్నీలోని రాళ్ల సమస్యలను తగ్గించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటారు. ఎన్ని మందులు వాడిన ఈ సమస్య తగ్గదు. అలాంటి వారు కాకరకాయ ఆకలను మెత్తగా చేసి దానిని నుదిటిపై రాస్తే.. క్షణాల్లో తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు.

# మునగ స్త్రీలకు ఎంతో మేలు చేస్తుంది



మన దేశంలో మునగ ప్రయోజనాలను పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు..? ఇది అందరికీ తెలిసిన విషయమే.. సులువుగా లభించే మునగకాయలను అందరూ ఇష్టపడతారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో మునగ చెట్టు ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కో రకంగా వాటి నుంచి లభించే మునగకాయలను తింటారు. మునగ రుచి, ఆరోగ్య ప్రయోజనాలు ప్రజలను ఆకర్షిస్తాయి. అయితే.. మునగలో ఉండే విటమిన్ సి, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దగ్గు, జలుబును నివారిస్తాయి. అంతేకాదు, క్యాల్షియం , ఐరన్ మునగలో పుష్కలంగా ఉంటాయి. మగవారికి మునగతో చేసిన వంటకాలు తినాలని చెబుతుంటారు. అయితే.. ఇది మగవారికే కాకుండా.. మహిళలకు కూడా ఎంతో ప్రయోజనాలను కల్గిస్తుంది. మునగలో గర్భిణీ స్త్రీలకు అవసరమైన నియాసిన్, రిబోఫ్లావిన్ , విటమిన్ బి12 వంటి బి విటమిన్లు కూడా ఉన్నాయి. మునగాలోని యాంటీబయాటిక్ ఏజెంట్లు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అలాగే, మునగలో జింక్ ఉంటుంది, ఇది చర్మ సంరక్షణకు చాలా మంచిది. గ్లుటాతియోన్ చర్యను వేగవంతం చేసే లక్షణాలను కూడా మునగ కలిగి ఉంది. శరీరంలో మొటిమలు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. మునగ ఆకు రసం చర్మాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పాలిచ్చే తల్లులు పాల సరఫరాను పెంచడానికి మునగను ఉపయోగిస్తారు. అంతే కాకుండా మురిపంలో ఉండే పొటాషియం, ఐరన్, కాల్షియం, విటమిన్ సి, బి, బీటా కెరోటిన్ , అమినో యాసిడ్స్ తల్లి పాలను పెంచడంలో సహాయపడతాయి. మునగ కొవ్వు తగ్గడానికి , బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మునగలో ఫైబర్ , మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆకలిని అదుపులో ఉంచుతాయి. ఉసిరి ఆకులతో నీరు తాగడం వల్ల కూడా రుతు నొప్పి తగ్గుతుంది. ఉసిరికాయ ఆకులతో నీటిని మరిగించి రోజూ తాగడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. ఇది కాకుండా, మునగా యొక్క హెపాటోప్రొటెక్టివ్ ఫంక్షన్ కాలేయాన్ని రక్షించడానికి , టాక్సిన్స్ నుండి రక్షించడానికి సహాయపడుతుంది. శరీరంలోని క్యాలరీల పరిమాణాన్ని తగ్గించడంలో కూడా మునగ మంచిది. మునగ లైంగిక ఉద్దీపనలో కూడా సహాయపడుతుంది. మునగలో ఉండే కామోద్దీపన సమ్మేళనం టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచుతుంది. ఆహారంలో మునగ పువ్వును చేర్చుకోవడం కూడా స్పెర్మ్ కౌంట్ పెంచడంలో సహాయపడుతుంది.

## పచ్చి ఉల్లిపాయల ప్రయోజనాలు

మన వంటింట్లో దొరికే కూరగాయలలో ఉల్లిపాయ కూడా ఒకటి. ఈ ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల లాభాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఉల్లిపాయను తరచుగా



తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఉల్లి చేసే మేలు అంతా ఇంతా కాదు. అందుకే ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని అంటూ ఉంటారు. అయితే కొందరు పచ్చి ఉల్లిపాయలు తింటే మరి కొందరు కూరల్లో తినడానికి ఇష్టపడుతూ ఉంటారు. మనలో చాలామంది పచ్చి ఉల్లిపాయ తినడానికి అసలు ఇష్టపడరు. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయట. మరి పచ్చి ఉల్లిపాయ తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. పచ్చి ఉల్లిపాయల్లో మన శరీరానికి అవసరమైన విటమిన్ సి, విటమిన్ బీ6, కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే పచ్చి ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్ తో పోరాడటానికి సహాయపడతాయి. అలాగే ఎన్నో రోగాల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలలో యాంటి క్యాన్సర్ లక్షణాలు కూడా ఉంటాయి. అంటే వీటిని మోతాదులో తింటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని కొందరు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాగే పచ్చి ఉల్లిపాయ డయాబెటిక్ పేషెంట్లకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందట. ఎలా అంటే మధుమేహులు పచ్చి ఉల్లిపాయలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలను తింటే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నార్మల్ గా ఉంటాయట. దీంతో మీ గుండె ఆరోగ్యంగా ఉంటుందని, శరీరంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ నార్మల్ గా ఉంటే గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. ఉల్లిపాయల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అంటే వీటిని తినడం వల్ల మంట, నొప్పి నుంచి ఉపశమనం కలుగుతాయట. ముఖ్యంగా చలికాలంలో కీళ్లనొప్పుల నొప్పుల నుంచి బయటపడాలంటే పచ్చి ఉల్లిపాయలను మోతాదులో తినడం చాలా మంచిదని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తవట.

## పళ్ళుతోమకుంటే ఏమవుతుంది..?

చాలా మంది తమ నోటిని దేవుని ఇల్లుగా భావిస్తారు. దానిలోని దంతాలు , ఆ ఒక్క నాలుక అన్ని విధాలుగా నీతిగా , శుభ్రంగా ఉంచబడతాయి. అక్కడ స్వేచ్ఛకు అనుమతి లేదు. అయితే కొన్ని ఉన్నాయి. వారి పొడవాటి నాలుకలను వదులుకోండి. దాంతో వారు గందరగోళానికి గురవుతారు. మరికొందరు పళ్లు తోముకోవడం, శుభ్రంగా ఉంచుకోవడం వంటి పనుల జోలికి వెళ్లరు. కానీ ఆ ప్రాతిపదికన, బ్రషింగ్‌ను ఒకటి లేదా రెండు రోజులు దాటవేయడం పెద్ద విషయంగా అనిపించదు. అయినప్పటికీ, మీ దంత పరిశుభ్రతను చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేయడం వలన మీ శరీరం యొక్క మొత్తం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నోరు మిలియన్ల బ్యాక్టీరియాలకు నిలయం. , మీరు మీ దంతాలను క్రమం తప్పకుండా బ్రష్ చేయకపోతే, బ్యాక్టీరియా సంఖ్య పెరుగుతుంది. ఇది నోటి దుర్వాసన లేదా తడిసిన దంతాల కంటే అనేక సమస్యలకు దారితీస్తుంది. బ్రష్ చేయని మొదటి కొన్ని రోజుల్లో నోటిలో తక్షణ మార్పులు సంభవిస్తాయి మీరు బ్రష్ చేయడం ఆపివేసినప్పుడు గుర్తించదగిన మొదటి మార్పు దంతాల మీద మృదువైన ఫలకం ఏర్పడటం. ఈ ఫలకం బ్యాక్టీరియాతో నిండిపోయి చిగుళ్లను చికాకుపెడుతుంది. ఇది మంటను కలిగిస్తుంది , ఈ ఎర్రబడిన చిగుళ్ళను తాకినప్పుడు లేదా సున్నితంగా బ్రష్ చేసినప్పుడు సులభంగా రక్తస్రావం అవుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డెంటల్ ప్లేక్ డెంటిన్‌లో డీకాల్సిఫికేషన్‌ను ప్రారంభించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి ఈ వైవిధ్యం ఫలకం మీ దంతాలను నాశనం చేసే ముందు ఎనామెల్ కింద రక్షిత పొరపై 48 గంటలలోపు సంభవిస్తుంది.



# జీరో ఆయిల్ కుకింగ్

ఎప్పుడైనా నూనె రుచి చూశారా? కచ్చితంగా నచ్చదు. కానీ నూనె వల్లే వంట రుచికరంగా ఉంటుందని నమ్ముతాం. అయితే ఆయిల్, నెయ్యి, వెన్నెకు సంబంధించిన ఒక్క చుక్క లేకుండా కూడా టేస్టీ ఫుడ్ ప్రిపేర్ చేయొచ్చని చెప్తున్నారు నిపుణులు. రుచిని త్యాగం చేయకుండా రుచికరమైన భోజనం వండొచ్చని వాగ్దానం చేస్తున్నారు. ప్రస్తుతం జీరో ఆయిల్ కుకింగ్ ట్రెండ్ అవుతుండగా.. ఈ విప్లవాత్మక విధానం, ఉపయోగాల గురించి తెలుసుకుందాం. జీరో ఆయిల్ కుకింగ్ అనేది ఎటువంటి నూనెలు లేదా కొవ్వులను ఉపయోగించకుండా ఆహారాన్ని తయారు చేయడాన్ని సూచిస్తుంది. ఈ వంట పద్ధతి స్టీమింగ్, బాయిల్ చేయడం, గ్రిల్లింగ్, రోస్ట్ చేయడం లేదా ఆహారాన్ని అంటుకోకుండా నిరోధించడానికి నాన్-స్టిక్ కుక్‌వేర్‌లను ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయాలపై ఆధారపడి ఉంటుంది. సుగంధ ద్రవ్యాలు, మూలికలు, నిమ్మకాయ, ఇతర సహజ రుచులను టేస్ట్ మెరుగుపరచడానికి ఉపయోగిస్తారు. తద్వారా నూనె అవసరం లేకుండా ఆహారాన్ని పోషకమైనదిగా, రుచిగా మారుస్తుంది. గుండె ఆరోగ్యం : నూనెను తగ్గించడం, ముఖ్యంగా అనారోగ్యకరమైన కొవ్వులు, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, రక్తపోటు, స్ట్రోక్స్ ప్రమాదాన్ని నివారిస్తుంది. నూనెలో సంతృప్త కొవ్వులు ఉంటాయి. ఇవి గుండెకు చాలా అనారోగ్యకరమైనవి. కాబట్టి నూనెను వాడకుండా ఉండటం ద్వారా.. ఈ సంతృప్త కొవ్వులను కూడా వదిలించుకోవచ్చు. వెయిట్ మేనేజ్మెంట్ : నూనెలో కేలరీలు ఎక్కువగా ఉన్నందునా.. మీ ఆహారం నుంచి దానిని తొలగించడం మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కిలోల బరువు తగ్గడానికి, వెయిట్ మేనేజ్మెంట్ కు సహాయపడుతుంది. నూనెలో కొవ్వు ఉంటుంది. అధిక కొవ్వు అధిక బరువు పెరగడానికి దారితీస్తుంది. కాబట్టి జీరో ఆయిల్ కుకింగ్ బరువు నిర్వహణలో సహాయపడుతుంది. జీర్ణక్రియ మెరుగు :భారీ, జిడ్డుగల ఆహారాలను జీర్ణం చేయడం కష్టం. అజీర్ణం, ఉబ్బరం, ఇతర జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. నూనె లేకుండా వంట చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నూనె లేకుండా, నూనె రహిత వంటకాలు చేసేందుకు కూరగాయలు, ధాన్యాలపై ఎక్కువ దృష్టి పెట్టడం వలన ఎక్కువ ఫైబర్ తీసుకునేందుకు కారణమవుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభమవుతుంది.



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

## సిల్వర్ గౌనులో దేవకన్యలా ఊర్వశి రౌతేలా.. కేన్స్‌లో మరోసారి తన మార్క్ చూపిన బ్యూటీ!



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 79వ ఎడిషన్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరాలో మే 12 నుంచి 23 వరకు జరిగే ఈ వేడుకకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రముఖులు హాజరయ్యారు. అలియా భట్, డెమీ మూర్ వంటి తారలు ప్రారంభోత్సవంలో తమ స్టైల్‌తో ఆకట్టుకోగా, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనదైన ప్రత్యేకమైన డ్రెస్సింగ్ స్టైల్‌తో రెడ్ కార్పెట్‌పై ప్రధాన ఆకర్షణగా నిలిచారు.ప్రారంభోత్సవం కోసం ఊర్వశి వియత్నాంకు చెందిన ఫ్యాషన్ లేబుల్ 'జోలీపోలీ' డిజైన్ చేసిన కస్టమ్ కౌచర్ గౌనును ఎంచుకున్నారు. లావెండర్ రంగు బేస్‌పై భారీ సిల్వర్ అలంకరణతో ఉన్న ఈ గౌను చూడగానే కట్టిపడేసింది. క్రిస్టల్స్, సీక్విన్స్, పూసలు, రాళ్ల వర్క్‌తో గౌను మొత్తం కేన్స్ లైట్ల వెలుగులో తళతళా మెరిసింది. మత్స్యకన్య ఆకారాన్ని పోలి ఉన్న ఈ గౌను ఆమె అందాన్ని రెట్టింపు చేసింది.ఈ డ్రెస్ ప్రత్యేకతల్లో కార్సెట్ తరహాలో ఉన్న బాడీస్ ఒకటి. గౌనుపై శిల్పం చెక్కినట్టుగా వెండి ఎంబ్రాయిడరీతో సున్నితమైన డిజైన్లు ఉన్నాయి. స్వీట్‌హార్ట్ నెక్లైన్‌తో పాటు భుజాల వద్ద ఉన్న అలంకరణలు డ్రెస్‌కు మరింత ఆకర్షణను తెచ్చిపెట్టాయి. పొడవైన కేప్ స్లీవ్స్, వాటికి వేలాడుతున్న క్రిస్టల్ టాసెల్స్... వెండి రెక్కలు తొడుక్కున్నట్టుగా ఆకర్షించాయి. "ఐసీ సిల్వర్" థీమ్‌కు తగ్గట్టుగానే ఊర్వశి ఆభరణాలను ధరించారు. స్టేట్‌మెంట్ చోకర్ నెక్లెస్, దానికి సరిపోయే చెవిపోగులు, బ్రేస్‌లెట్‌తో పాటు జుట్టు ముడి మధ్యలో పక్షి ఆకారంలో ఉన్న మాంగ్ టిక్కా తరహా తల ఆభరణం అందరి దృష్టినీ ఆకర్షించింది. గౌను మొత్తం ఒకే రంగులో ఉన్నప్పటికీ, ఆమె చేతిలో పట్టుకున్న రంగురంగుల రాళ్లు, అద్దాలతో పొదిగిన బాక్స్ క్లచ్ ప్రత్యేకంగా నిలిచింది. ఇక పూర్తి గ్లామ్ మేకప్‌తో ఊర్వశి మరింత ప్రకాశవంతంగా కనిపించారు. సిల్వర్ షిమ్మర్ ఐస్, నిగనిగలాడే పెదవులు, ముఖానికి ఫ్రేమ్‌లా ఉన్న హెయిర్‌స్టైల్‌తో తన లుక్‌ను పూర్తి చేశారు. మొత్తంగా తనదైన బోల్డ్, మాక్సిమలిస్ట్ రెడ్ కార్పెట్ స్టైల్‌ను ఊర్వశి మరోసారి కేన్స్‌లో ప్రదర్శించారు.

## త్రిష-సూర్య కొత్త చిత్రం 'కరుప్పు' ప్రత్యేక ప్రదర్శనలకు తమిళనాడులో అనుమతి

ప్రముఖ నటుడు సూర్య, త్రిష కృష్ణన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కరుప్పు'కు తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి ఇచ్చింది. మే 14న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న సందర్భంగా, మే 14, 15 తేదీల్లో స్పెషల్ షోలు వేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్ర నిర్మాతల అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వుల ప్రకారం, ఈ రెండు రోజులు ఉదయం 9 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 2 గంటల వరకు థియేటర్లలో రోజుకు గరిష్టంగా ఐదు షోలు ప్రదర్శించుకోవచ్చు. ఈ ప్రత్యేక ప్రదర్శనల సమయంలో థియేటర్ల వద్ద భద్రతా జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం థియేటర్ యాజమాన్యాలకు సూచించింది. ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామాను డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మించింది. ప్రత్యేక షోలకు అనుమతి ఇచ్చినందుకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు చిత్ర నిర్మాణ సంస్థ ధన్యవాదాలు తెలిపింది. సూర్య, త్రిష ప్రదాన పాత్రల్లో నటిస్తుండగా, బాలాజీ కీలక పాత్ర పోషించారు. తెలుగులో వీరభద్రుడు పేరుతో విడుదల కానుంది. కాగా, కొంత కాలంగా తమిళనాడులో ప్రత్యేక ప్రదర్సనలు లేవన్న సంగతి తెలిసిందే. చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తి విజయ్ ముఖ్యమంత్రిగా ఉండటంతో స్పెషల్ షోలకు అనుమతి ఇస్తారని సినీ అభిమానులు ఆశించారు. అందరూ అనుకున్నట్లుగానే ప్రభుత్వం ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి ఇవ్వడంతో కోలీవుడ్ లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.






## ఐపీఎల్ ఎఫెక్ట్... సమంత 'మా ఇంటి బంగారం' రిలీజ్ డేట్ మారింది!

**వాయిదా పడ్డ సమంత 'మా ఇంటి బంగారం' చిత్రం**

**జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల**

**ఐపీఎల్ సీజన్ కారణంగానే వాయిదా వేస్తున్నట్టు ప్రకటన**

**గన్‌తో ఉన్న సమంత కొత్త పోస్టర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం**

స్టార్ హీరోయిన్ సమంత నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా కొత్త విడుదల తేదీని చిత్ర బృందం నేడు ప్రకటించింది. ముందుగా ప్రకటించిన ప్రకారం మే 15న కాకుండా, కొత్తగా జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బుధవారం నాడు గన్‌తో ఉన్న సమంత రగ్డ్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్ కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చిత్ర నిర్మాణ సంస్థ ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రేక్షకులు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మద్దతుదారులు టోర్నమెంట్‌ను పూర్తిగా ఆస్వాదించడానికి అవకాశం కల్పించేందుకే సినిమాను వాయిదా వేస్తున్నట్టు వివరించింది. డిస్ట్రిబ్యూటర్ల అభ్యర్థన మేరకు ఐపీఎల్ వేడిని దృష్టిలో ఉంచుకుని ఈ మార్పు చేసినట్టు పేర్కొంది. 'ఓ బేబీ' తర్వాత నందిని రెడ్డి దర్శకత్వంలో సమంత నటిస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. దీనికి రాజ్ నిడిమోరు క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. సమంత తన సొంత బ్యానర్ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' పై నిర్మాతగా మారి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సమంత ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాల్లో నటించినట్టు తెలుస్తోంది.